ప్రజాశక్తి

మంగళవారం 28 మే 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఓట్ల లెక్కింపునకు సమాయత్తం

నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాట్లుపరిశీలిస్తున్న ముఖేష్‌కుమార్‌మీనా

- స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించిన ముఖేష్‌కుమార్
- రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష
- శిక్షణకు హాజరు అయిన అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఓట్ల లెక్కింపు జూన్ 4న జరగనుంది. ఓట్ల లెక్కింపునకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గుంటూరు,పల్నాడు జిల్లాల కలెక్టర్లు రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ అధికారులకు, సిబ్బందికి అవగాహన, శిక్షణ నిర్వహించారు. రిటర్నింగ్ అధికారులకు లెక్కింపులో తీసుకోవాల్సిన మార్గదర్శకాలు, జాగ్రత్తలను వివరించారు. మొత్తం 2500 మంది సిబ్బంది ఓట్ల లెక్కింపులో పాల్గొంటారు. సిబ్బంది ఎంపిక దాదాపుగా పూర్తి అయింది. వివిధ దశలో ఇచ్చే శిక్షణలో సాంకేతిక అంశాలు, ఈవిఎంలతో పాటు వీవీప్యాట్‌ల స్లిపుల లెక్కింపు, సర్వీసు, పోస్టల్ ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. లెక్కింపులో ప్రతి రౌండ్ పూర్తయిన తరువాత ఏజెంట్లతో సంతకాలు తీసుకుని మరో రౌండ్ లెక్కింపును ప్రారంభించాలని ఎన్నికల కమిషన్ నిర్ధేశించింది. ఈవిఎంలు, వీవీప్యాట్‌ల ఓట్ల లెక్కింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవిఎంలు లెక్కింపు సమయంలో మొరయించినా సాంకేతిక పరమైన సమస్యలు వచ్చినా ఎలా వ్యవహారించాలో కూడా సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఐదు వీవీ ప్యాట్‌ల స్లిప్పులను మాత్రమే లెక్కిస్తారు. నియోజకవర్గాల్లో శిక్షణ పూర్తి చేసినా జూన్ 4వ తేదీ వరకు ఎవరు ఏ నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపులో పాల్గొంటారన్నదీ అత్యంత గోప్యంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈమేరకు సిబ్బంది జాబితాలను ఎన్నికల కమిషన్‌కు పంపి జబ్లింగ్ పద్ధతిలో ఒక నియోజకవర్గం చెందిన సిబ్బందిని మరో నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపునకు వినియోగిస్తారు. ఏజెంట్లకు సాంతికపరమైన శిక్షణ అవసరమని తెలియడంతో అభ్యర్థులు కూడా ఇప్పటికే ఈ దిశగా సాంకేతిక అనుభవం ఉన్న వారిని ఎంపిక చేసుకునే దిశగా ఏర్పాట్లలో నిమగ్నం అయ్యాయి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి, దాని పరిధిలోని పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు వేర్వేరుగా 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తారు. ప్రతి టేబుల్‌కు కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జూన్ 3వ తేదిన జరిగే రెండవ ర్యాండమైజేషన్‌లో కౌంటింగ్ సిబ్బందికి అసెంబ్లీ నియోజకవర్గాలు కేటాయిస్తారు. కౌంటింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులు జూన్ 4వ తేది ఉదయం 5.00 గంటలకు ఖచ్చితంగా లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాలని

2లో

గుంటూరు రైతు సంఘం కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతున్న వి కృష్ణయ్య

కాల్వల మరమ్మతులు వెంటనే చేపట్టాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య

ప్రజాశక్తి-గుంటూరు

కాలువల పూడికతీత, మరమ్మతులు వెంటనే చేపట్టి, ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి రైతులకు అందుబాటులోకి తేవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య అన్నారు. సోమవారం స్థానిక బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం జొన్న శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కమిటీ సమావేశం ఆర్‌బికెల ద్వారా విత్తనాలు సమృద్ధిగా అందేలా చూడాలని, తుపాన్ నష్టపరిహారం అందరికి అందేలా చూడాలని, పెదవడ్లపూడి హై లెవెల్ ఛానల్ వెంటనే పూర్తి చేసి వేల ఎకరాలకు నీళు అందించేలా చేయాలని, కొండవీటి వాగుకు గురవుతున్న భూములను కాపాడి శాశ్వత పరిష్కారం చేయాలని, కాలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలని తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో, జిల్లాలో రైతాంగ సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయన్నారు .రైతుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయన్నారు. గత డిసెంబర్‌లో వచ్చిన మిచౌంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించి రిపోర్టు సేకరించడంలో జాప్యం చేయడం, నిధుల లేమి పేరుతో ఇంత వరకూ పరిహారం చెల్లించ లేదన్నారు. బడ్జెట్లో వ్యవసారంగానికి నిధులు తగ్గించడం, సబ్సిడీలు ఎత్తివేయడం వల్ల ఆ భారం రైతులపై పడుతుందన్నారు. మద్దతు ధరలు లేక రైతులు భారీగా నష్టపోయారన్నారు. ఢిల్లీ రైతు పోరాటం సందర్భంగా మద్దతు ధరల చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చిన కేంద్రం మొండి చేయి చూపిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేయటానికి బలవంతం చేస్తుందని, రైతులకు నష్టం కలిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చిందన్నారు. ఈ చట్టాన్ని చంద్రబాబునాయుడు రద్దు చేస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారని, కానీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కి పార్లమెంట్‌లో టిడిపి ఓటు వేసిందని తెలిపారు. ఈ ఏడాది వర్షాలు ముందుగా రావడంతో వ్యవసాయం పనులు ప్రారంభం అవుతున్నాయని, కావున విత్తనాల కొరత తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు

2లో

సిమెంటు ఫ్యాక్టరీ స్థలంలో ఉద్రిక్తత
స్థలం స్వాధీనానికి కార్మికుల యత్నం
7లో

పాలీసెట్ ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం
8లో

చదువుల ఖిల్లా సత్తెనపల్లి
విద్యారంగం ప్రత్యేకం
4,5 పేజీల్లో

శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డి ఎస్ పి ఎల్ అశోక్ కుమార్ గౌడ్, పక్కన సిఐ అనూరాధ

మందడంలో శాంతి కమిటీ

ప్రజాశక్తి - తుళ్లూరు

'సామరస్యంగా మెలగండి.. ఉద్రిక్తత లకు తావివ్వకండి.. రాజధాని అమరావతిలో అశాంతి వద్దు.. పోలీసులకు సహకరించమని..' డి ఎస్ పి ఎల్ అశోక్ కుమార్ కోరారు.జూన్ 4 వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్న దృష్ట్యా సోమ వారం రాజధాని ప్రాంతం మందడం పంచాయతీ కార్యా లయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు,వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శాంతి కమిటీ ఏర్పాటైంది. ఈ సందర్భంగా డి ఎస్ పి మాట్లాడుతూ,ఈ నెల 13 వ తేదీన జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరగాలన్న ఉద్దేశ్యంతో పోలీసులు ఎంతో సంయమనం పాటించారని, జూన్ 4 న ఆ విధంగా ఉండదని విద్వేషాలను రెచ్చగొట్టడం,శాంతి యుత వాతావరణంకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గొడవలలో తలదూర్చి కేసుల్లో ఇరుక్కోవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐ జె అనూరాధ పాల్గొన్నారు.

వెంకటపాలెంలో కొవ్వొత్తులతో నినదిస్తున్న మహిళలు

వెంకటపాలెం లో 'అమరావతి వెలుగు'

జగన్ చరిత్ర హీనులుగా మిగిలిపోతారు

ప్రజాశక్తి - తుళ్లూరు

అధికారంలోకి రాకముందు అమరావతి రాజధానికి మద్దతు తెలిపి ముఖ్యమంత్రి అయ్యాక మాట తప్పిన జగన్మోహన్ రెడ్డి చరిత్ర హీనులుగా మిగిలిపోతారని రైతులు అన్నారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు, మహిళలు, రైతుకూలీలు చేస్తున్న దీక్షలు సోమవారంతో 1623వ రోజుకు చేరాయి. తాడికొండ, వెంకటపాలెం, తుళ్లూరు, అనంతవరం తదితర గ్రామాల్లో రైతుల దీక్షలు సాగాయి. తాను రైతు పక్షపాతినని జగన్మోహన్ రెడ్డి పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటారని,ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తారని అన్నారు.అందుకు అమరావతి రైతుల పట్ల జగన్మోహన్ రెడ్డి వ్యవహరించిన తీరే నిదర్శనమన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి బిల్డ్ అమరావతి,సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

శ్రీ దత్త సాయి జయంతి సందర్భంగా మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు పట్టణంలోని ఎన్జీరంగా విగ్రహం వద్ద సోమవారం శ్రీ దత్త సాయి 82వ జన్మదినం పురస్కరించుకొని మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ దత్త సాయి హ్యూమన్ సర్వీసెస్ పొన్నూరు శాఖ నిర్వాహకులు బాల నాగ వెంకట సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు సుధారాణి, రూపశ్రీ దుర్గ, సాయి చెక్కు కిత్, రామకృష్ణ, విజయ్ కుమార్, ఉమామహేశ్వరరావు, మల్లి, హరీష్ పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి సందర్భంగా సోమవారం పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. తొలుత విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు నన్నపనేని శివప్రసాద్ కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ వీరేశలింగం సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహితీవేత్త అని అన్నారు. బాలికల విధ్యకోసం ప్రచారం చేయడమే గాక , పాఠశాలలు నిర్మించారని బాలబాలికలు కలసి చదువుకునే విధానాన్ని ప్రోత్సాహించా రని, అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడి అన్ని కులాల పిల్లలు కలసి చదువుకునేలా సంస్కరణ తీసుకొచ్చిన మహానుభావుడు అని కొనియాడారు. పేద విద్యార్థులకు పుస్తకాలు బలపాలుపలకలు కొనిచ్చేవారని, బాల్య వివాహాలను వ్యతిరేకించి, వితంతు వివాహాలను ప్రోత్సహించి ఆచరణలో చూపాడన్నారు.దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ కందుకూరి ఎన్నో ఆంగ్ల, సంస్కృత గ్రంథాలను తెలుగులోనికి అనువదించారని, బడి పిల్లల కోసం వాచకాలు రచించారని అన్నారు. దేవుడు, దెయ్యాలను నమ్మేవాడు కాదన్నారు. ఆయన రచనల్లో రాజశేఖర చరిత్ర అనే నవల ప్రసిద్ధి గాంచిందని అన్నారు. 150 గ్రంథాలకు పైగా వ్రాసిన గొప్ప కవి వీరేశలింగం పంతులు అని అన్నారు. సభలో చుక్కా యానాదులు, మర్రి లక్ష్మి, ఫణిదపు భువనేశ్వరి, కె లక్ష్మీనారాయణమ్మ, పుస్పావతి, విధ్యార్ధినీ విద్యార్థులు కందుకూరి చిత్రపటాలనికి నివాళులర్పించారు.

వీరేశలింగం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు , విద్యార్థులు

తల్లీ,బిడ్డకు ట్యాగ్ తప్పని సరి

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లి బిడ్డకు ప్రతిరోజూ ట్యాగ్ తప్పనిసరిగా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం నవ జాత శిశువు ల దొంగతనాన్ని నిరోధించే (ఆర్ఎఫ్ఐడి) ట్యాగ్ ఏర్పాటు కేంద్రాన్ని ఆయన పరిశీలిం చారు. అనంతరం బాలింతల వార్డును కూడా తనిఖీ చేశారు. తనిఖీల్లో అనేకమంది తల్లిబిడ్డలకు ట్యాగ్ లేకపోవడాన్ని గుర్తించినట్లు ఆయన చెప్పారు. కేవలం కంటి తుడుపుగా గుత్తేదారుడు పని చేస్తున్నట్లు కనపడుతోందని అయన అన్నారు. ఒక్కోక్క వార్డులో 25 నుంచి 30 మంది బాలింతలు ఉండగా అందులో కేవలం అయిదారు మందికి మాత్రమే ట్యాగ్‌ను అమరుస్తున్నట్లు ఆయన చెప్పారు. కాన్పు అయినా ప్రతి బాలింతకు, బిడ్డకు ట్యాగ్‌ను అమర్చల్సిన అవసరం ఉందన్నారు. బాలింతలకు, బిడ్డలకు ట్యాగ్‌లు లేకపోవడం వల్ల పిల్లలు అపహరణకు గురయ్యే ప్రమాదం ఉందని ఈ విషయాన్నీ పలుమార్లు గుత్తే దారుడుకు చెప్పిన పెడ చెవిన పెడుతున్నారని ఆయన అన్నారు. ఇక్కడ పని చేసే సిబ్బంది కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారని మూడు షిఫ్ట్‌ల్లో ముగ్గురును నియమించక పోవడం వల్ల అనేక సమస్యలు ఎదురవు తున్నాయని తెలిపారు. దీనివల్ల సాయంత్రం, రాత్రి సమ యాల్లో పిల్లల సంరక్షణ కు సరైన చర్యలు తీసుకోలేక పోతున్నారని అయన చెప్పారు. తల్లి బిడ్డకు ట్యాగ్ తీసి పెట్టుకునే విధంగా కాకుండా లాక్ పడే విధంగా ట్యాగ్ ను కట్టుదిట్టంగా పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గుత్తేదారునికి నోటీసులు పంపించినట్లు ఆయన చెప్పారు.

మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్ కుమార్

పల్నాడులో పంజాబ్ హిమోగ్లోబిన్ డి కేసుల గుర్తింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి పాథాలజీ విభాగం అరుదైన పంజాబ్ హిమోగ్లోబిన్ డి రోగ నిర్ధారణను గుర్తించారని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం శుశ్రుత హాలులో రోగ నిర్ధారణ పరీక్ష గురించి ఆ విభాగం వైద్యులతో కల్సి ఆయన మాట్లాడారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామ శివారు శ్రీరాంపురం తండా కు చెందిన ఇద్దరు వ్యక్తులకు ఈ నెల 20 వ తేదీన రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేసినట్లు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ పరీక్షల్లో అరుదైన పంజాబ్ హిమోగ్లోబిన్ డి గా గుర్తించారని చెప్పారు. సాధారణంగా పెద్దవారికి హిమోగ్లోబిన్, పసికందు లకు ఫీటల్ హిమోగ్లోబిన్‌లు ఉంటాయన్నారు. ఇవే కాకుండా హిమోగ్లోబిన్‌లో దాదాపు 150 నుంచి 200 కు పైగా హిమోగ్లోబిన్‌లు ఉంటాయని తెలిపారు. వాటిలో పంజాబ్ హిమోగ్లోబిన్, ఇరాన్ హిమోగ్లోబిన్ డి గా గుర్తించారని తెలిపారు. ఇవి సాధారణంగా పంజాబ్, ఇరాన్ పరిసర ప్రాంతాల్లో బాధితులు ఉంటారని, తొలిసారిగా ఎపి లో ఇలాంటి రక్త హీనతతో బాధపడుతున్న వారికి పరీక్షలు జరిగాయని చెప్పారు. రక్తం తగ్గిపోయిన తర్వాత వచ్చిన రోగులకు పరీక్షలు చేసిన తర్వాత ఇవి బయటపడ్డాయని చెప్పారు. ఈ పరీక్షల్లో పంజాబ్ హిమోగ్లోబిన్ తో పాటు సికెల్ సెల్ హిమోగ్లోబిన్ కూడా వారికి కల్సి ఉన్నట్లు గుర్తించారని ఇలాంటి కలయిక అరుదుగా ఉంటుందని అన్నారు. పంజాబ్ హిమో గ్లోబిన్ తో బాధపడే వారు రక్త హీనత కు గురవుతుంటారని ఆయన చెప్పారు. దీనికి వైద్యం బోన్ మారో (ఎముకల్లో ఉండే మూలుగు), స్టెమ్ సెల్ థెరపీ చెయ్యాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వైద్యం చేయాలంటే చాలా ఖరి దైందని, అయితే రక్త హీనత కు సరైన వైద్యం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. పాథలాజీ విభాగం హెచ్ ఓ డి డాక్టర్ సి అపర్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ టి భరత్, డాక్టర్ మహేష్, డాక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు సమాయత్తం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు నిర్ధేశించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ ఢిల్లీనుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్‌లతో సమీక్షించారు. గుంటూరు జిల్లాకు సంబంధించి నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు, పల్నాడు జిల్లాకు సంబంధించి నరసరావుపేట జెఎన్‌టియు కళాశాలలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరగనుంది.

రాష్ట్ర ఎన్నికల అధికారి సందర్శన

నాగార్జున విశ్వవిద్యాలయంలో గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఏడు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపుకు చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర ప్రదాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా , జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ తూషార్ డూదీ తో కలసి సోమవారం సాయంత్రం పరిశీలించారు. తొలుత ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూంలతో పాటు, కౌంటింగ్ హాల్స్ ను పరిశీలించారు. కౌంటింగ్ హాలు నందు కౌంటింగ్ టేబుళ్ళ ఏర్పాటుతో పాటు, కౌంటింగ్ సిబ్బందికి మరియు కంటెస్టింగ్ క్యాండెట్లు, ఏజెంట్లకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. అనంతరం మంగళగిరి, తెనాలి, పొన్నూరు, గుంటూరు పశ్చిమ, గుంటూరు తూర్పు, తాడికొండ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ హాల్ మరియు మీడియా సెంటరును పరిశీలించారు. ఏడు నియోజకవర్గాలు మరియు ఒక పార్లమెంట్ నియోజకవర్గాల ఈవీఎంల స్ట్రాంగ్ రూంలను, కంటెస్టింగ్ క్యాండిడెట్లు లేదా వారి తరుపున ప్రతినిధులు ఎప్పటికప్పుడు పరిశీలించుకునేందుకు వీలుగా డెక్ మెన్ హాలులో ఏర్పాటు చేసిన టీవీలను రాష్ట్ర ప్రదాన ఎన్నికల అధికారి పరిశీలించి అక్కడ హాజరైన అభ్యర్ధులతో మాట్లాడారు. కంటెస్టింగ్ క్యాండిడెట్లు మరియు వారి తరుపున ప్రతినిధులు ప్రత్యక్షంగా కూడా ఈవీఎంలు భద్రపర్చిన గదులను పరిశీలించుకోవచ్చని ఈ సందర్భంగా వారికి తెలిపారు.

కాల్వల మరమ్మతులు వెంటనే చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

సరిపోయేంత విత్తనాలు అందించాలన్నారు. భూసార పరీక్ష కూడా చేయిం చాలన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పొడిగింపు పూర్తి చేసేంతవరకు ఉద్యమ కొన సాగించాలన్నారు . రాజధాని రైతులకు కౌలు వెంటనే చెల్లించాలని, దుగ్గిరాలలో దగ్ధం అయిన శుభం కోల్డ్ స్టోరేజీ బాధిత రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. భూ సర్వే పేరుతో గ్రామాల్లో అస్తవ్యస్తంగా ఉన్న పాసు పుస్తకాలు సరిచేసి ముఖ్యమంత్రి ఫొటోను తొలగించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, సంఘ ఉపాధ్యక్షులు కాజా వెంకటేశ్వ రరావు, సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, టి. ప్రసాద్‌రెడ్డి, కె.పూర్ణచంద్రరావు, కె.స్రవంతి, కె.ఈశ్వర్‌రెడ్డి, కె.వాసుదేవరావు, సిహెచ్.భాస్కరరావు, జి. నాగేశ్వరరావు, ఇ.రామారావు, ఎ. సాంబిరెడ్డి,డి. గణేష్ బాబు పాల్గొన్నారు.

ఘర్షణలకు దిగరాదు : లాలాపేట సిఐ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :రాబోయే ఎలక్షన్ కౌంటింగ్ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ప్రజలతో అధికారులు ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం లాలాపేటలో సిఐ పి.దేవ ప్రభాకర్ మాట్లాడుతూ ఫలితాలు రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుం దన్నారు. నిబంధనల ప్రకారం వ్యవహరించాలని కోరారు. గుంపులు గుంపులుగా తిరగరాదని, ఎవరూ ఘర్షణలకు దిగరాదని, ప్రజలు ఇచ్చిన తీర్పునకు మాత్రమే ఫలితాలు వస్తాయని ఎవరు

గెలిచినా ప్రజలు ఘర్షణలకు దిగరాదన్నారు.

ప్రజాశక్తి-పెదకూరపాడు :కౌంటింగ్ సందర్భంగా ప్రజలు శాంతి యుతంగా ఉండాలని సత్తెనపల్లి డి.ఎస్.పి నరసింహారావు కోరారు. సోమవారం పెదకూర పాడు లో పోలీసులు ర్యాలీ నిర్వ హిం చారు. అనంతరం ఆయన మాట్లాడారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల :మండల కేంద్రమైనా ముప్పాళ్లలో పోలీ సులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సత్తెనపల్లి రూరల్ సిఐ రాంబాబు,ఎస్ఐ హజరతయ్య ఆధ్వర్యంలో సరైన పత్రాలు నెంబర్ ప్లేటులు లేని పది ద్విచక్రవాహనాలను, ఒక ఆటో ను స్వాధీనం చేసు కున్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట: స్థానిక 27 వ వార్డులో సోమవారం ఉదయం ఉదయం 5.30 గం.నుంచి పత్రాలు లేని వాహనాలను పెద్ద ఎత్తు న గుర్తించి వాటిని స్టేషన్‌కు తరలించారు.కార్యాలయంలో పట్టణ ఎస్.ఐ. లు పుల్లారవి,సుమన్,సిబ్బంది పాల్గొ న్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున గుంటూరు-విజయవాడ మార్గంలో ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద జరిగింది. ఈస్టు ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పిల్లి సునీల్ బాబు ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ గమనించకపోవడంతో ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాల అవడంతో ఘటనా స్థలంలోనే మత్యువాత పడిన సునీల్ మృతి చెందాడు. మతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తర లించారు. పెదకాకాని పి.ఎస్ ఏ.ఎస్.ఐ ఆంటోనీ రాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తోటి కానిస్టేబుల్ చనిపోవ డంతో ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

లారీ డ్రైవర్ నాగరాజు

తెలంగాణ ఆర్టీసీ బస్సు లారీని ఢీ కొన్న ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన రాజుపాలెం మం డలం చౌట పాపాయపాలెం సమీపంలో సోమవారం సాయంత్రం చోటు చేసు కుంది. ఈ ప్రమా దంలో ఏలూరు జిల్లా ఏలూరు పట్టణంలోని ప్రకాష్ నగర్ కు చెందిన లారీ డ్రైవర్ పానకాల నాగరాజు (50) అక్కడికక్కడే మృతి చెందాడు. హైదరాబాద్ నుండి గుంటూరు వస్తున్న టిఎస్ఆర్టీసీ బస్సు చౌటపాపాయపాలెం సమీపంలో రోడ్డు మీద ఉన్న గుం టను తప్పించే క్రమంలో సత్తెనపల్లి నుండి పిడుగురాళ్ల వైపు వెళుతున్న లారీని ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. బస్సులో ఉన్న ప్రయాణికులు స్వల్పగాయాలయ్యాయి . మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్య శాలకు తరలించారు. రాజుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంగళగిరిలో వరిగడ్డి వామి దగ్ధం

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని ద్వారక నగర్ లో సోమవారం తెల్లవారుజామున వరిగడ్డి వామి అగ్నిప్రమాదంలో అగ్నికి ఆహుతి అయింది. కుర్ర బుల్లియ్య చెందిన ఎనిమిది ఎకరాల ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో వరిగడ్డి వాము దగ్ధమైనట్లుగా అగ్నిమాప అధికారులు తెలిపారు. ఈ మేరకు వెంటనే స్పందించి మంటలను అవుదువు చేయడం జరిగిందని తెలిపారు. ఎనిమిది లక్ష రూపాయలు నష్టం జరిగినట్లుగా తెలిపారు.

సత్తెనపల్లి మండలం ఫణిదంలో దగ్ధమైన వరిగడ్డి వామిని ఆర్పుతున్న చిత్రం

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

వారిగడ్డి వామి అగ్నికి ఆహుతైంది.సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ప్రమాదవ శాత్తు మూడు ఎకరాల గడ్డి వామి దగ్ధమైయింది.వలేటి వినయ్ కు చెందిన వరిగడ్డి వామి లో నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సాయంకాలంలో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు సుమారు 50వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

మనస్థాపంతో భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి-పెదకూరపాడు

దంపతులు మధ్య విభేదాలతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తాళ్లూరులో చోటు చేసుకుంది. ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాలు ప్రకా రం తాళ్లూరి వీరయ్య (26) స్థానిక ఎస్సీ కాలనీలో నివాసముంటు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఏడాది క్రితం సిరిగిరిపాడుకు చెందిన దివ్యతో వీరయ్యకు వివాహం జరిగింది. కొన్ని నెలలు సజావుగా జరిగిన వారి కాపురంలో అనుమానం అనే పెనుభూతం ఆవరించి కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి దంపతుల మధ్య గొడవలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది. మనస్థాపం చెందిన వీరయ్య పెదకూరపాడు కోల్డ్ స్టోరేజ్ సమీపంలో పురుగుమందు సేవించాడు. అన్నదాతలు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మతదేహాన్ని పంచనామా కోసం అమరావతి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మతుని తండ్రి గురువులు తల్లి వెంకాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్తు తీగ తెగి యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-వినుకొండ

విద్యుత్తు తీగ తెగి ఓ యువ కుడు తీవ్రంగా గాయపడిన సంఘటన విను కొండ మండలం లోని గోనుగుంట్ల వారిపాలెంలో సోమ వారం జరిగింది. గ్రామానికి చెందిన సల్లూరి వంశీ (19) యువకుడు ఇంటి వెనక నిలబడి ఉన్న సమయంలో అకస్మాత్తుగా పైన ఉన్న విద్యుత్తు తీగ తెగి పడటంతో కరెంటు షాక్‌తో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సహాయంతో క్షతగాత్రున్ని వినుకొండ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తర లించగా వంశీ శరీరం అధిక శాతం కాలి పోయిందని, పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మెరుగైన వైద్యం నిమిత్తం వంశీని నరసరావుపేట తరలించి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తు న్నారు. ఈ ప్రమాదానికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణ మని స్థాని కులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బాదిత కుటుంబ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

ప్రమాదంలో మృతి చెందిన ఒక్కో గేదేకు లక్ష రూపాయల చొప్పున

పాడి రైతుకు నష్టపరిహారమివ్వండి

చిర్రావూరులో గేదెలు మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించిన వి. కృష్ణయ్య , జొన్న శివశంకరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరులో ప్రమాదవశాత్తు ఆదివారం సాయంత్రం విజయవాడ నుండి నూతక్కి వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీ కొని ఎనిమిది గేదెలు మృతి చెందిన ఘటన విదితమే. ఈ ఘటనలో మృతి చెందిన పశువుల రైతులకు నష్టపరిహారం అందించాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య అన్నారు. సోమవారం చిర్రావూరులో రైతు సంఘం నాయకులతో కలిసి ప్రమాదం జరిగిన తీరును ఆయన పరిశీలించారు. అనంతరం పశువుల రైతులను కలుసుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ పాడి సంపదపై జీవనం సాగిస్తున్న రైతులకు తీరని నష్టం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి పశువులపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు పశుపోషణ కష్టతరంగా మారిందని అన్నారు. ఒకవైపు వ్యవసాయం గిట్టుబాటు కాక, పాడినే జీవనాధారం చేసుకొని కొంతమంది రైతులు జీవిస్తున్నారని అన్నారు. పాడి పశువులు నష్టపోయిన రైతుకు ఒక్కో గేదేకు లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర రావు మాట్లాడుతూ పాడి పశువులు అధికంగా ఉన్న చిర్రావూరులో గత పదిహేనేళ్లుగా పశు వైద్యశాలకు వైద్యుడిని నియమించలేదని అన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితులలో పశువులకు వైద్యం అందించేందుకు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని, పాడి రైతులు వేల రూపాయల ఖర్చు చేయాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ రంగంతో పాటు, పాడి పశువులను కూడా రక్షించుకోవాల్సిన అవశ్యకత రైతులపై ఉందన్నారు. పశుపోషణకు కావాల్సిన మేత(దాణా) పాడి రైతు లకు అందిం చాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, రైతు సంఘం రాజధాని నాయకులు కొర్రపోలు ఈశ్వరరెడ్డి, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, బొప్పన గోపాల రావు, మేడూరి పాములు, సంఘం తాడేపల్లి మండల నాయకులు పల్ల పాటి సుబ్బారావు, తెలుగు రైతు గుం టూరు పార్లమెంట్ అధ్యక్షులు కె.రాజ శేఖర్ రెడ్డి, మంగళగిరి నియోజక వర్గ తెలుగు రైతు అధికార ప్రతినిధి ఎ. సుబ్రహ్మణ్యం, టిడిపి చిర్రావూరు గ్రామ అధ్యక్షులు వి.శ్రీనివాసరావు, వైసిపి రైతు నాయకులు ఎం.సాంబశివరావు, టిడిపి గుండిమెడ గ్రామ నాయకులు కె. మధు పాల్గొన్నారు.

యువకుల మధ్య గొడవ

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆర్ఎంఎస్ కాలనీ సమీపంలోని మసీదు వద్ద అతిగా మద్యం సేవించి యువకులు ఘర్షణ పడ్డారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో 107 కింద కేసు నమోదు చేసి సోమవారం తాడేపల్లి తహశీల్దార్ ముందు హాజరుపరిచినట్లు పట్టణ సిఐ కల్యాణరాజు తెలిపారు. పోలింగ్ అనంతరం ఫలితాలు మరో వారం రోజుల్లో రానున్న నేపథ్యంలో తమ పార్టీ గెలుస్తుందంటే తమ పార్టీ గెలుస్తుందని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన యువకులు తాగి ఘర్షణ పడ్డారు. ఎస్ఐ ప్రతాప్ యువకులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోసారి ఇలాంటి జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇప్పటి దాకా ప్రశాంతంగా ఉన్న తాడేపల్లి ఎన్నికల అనంతరం ఎటువంటి ఉద్రిక్తత పరిస్థితులకు దారితీస్తాయోనని పోలీసులు ముందస్తు జాగ్రత్తలకు సిద్ధమవుతున్నారు.

పలు నేరాలకు పాల్పడ్డ ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పలు నేరాలతో సంబంధం ఉన్న ముగ్గురు దొంగలను పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.. గుంటూరుకు చెందిన హెూటల్ కార్మికుడు చల్లా రంజిత్ కుమార్ రెడ్డి, ఆటోడ్రైవర్ ముడావత్ హనుమంత్ నాయక్, పంబ్లర్ వంగూరి లోకేష్ లు స్నేహితులు.వీరు చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల సత్తెనపల్లి పట్టణంలో ఓ నగల దుకాణంలో దొంగతనానికి ప్రయత్నించారు. పెట్రోలింగ్ పోలీసులు గమనించి ముగ్గురిని పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

NOTICE
IN THE COURT OF III RD ADDL. JUNIOR CIVIL JUDGE :: GUNTUR
O.S. NO. 1645/2022

Between:
Putti Ranga Rao ..... Plaintiff
Vs
Y.Atchamamba ..... Defendant
To,
Y.Atchamamba, W/o Kanakaraju, R/o Plot No. 203, Reddy Apartment, 5th Line, Mallikarjuna Peta, Guntur.

అను వారికి పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు పై కోర్టువారి ద్వారాను అనేకసార్లు నోటీసులు పంపించినను మీకు ముట్టనందున మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టువారు ది. 18-6-2024కి వాయిదా వేసినారు. కావున వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయంగా గానీ, లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొన గలరు. లేనిచో శ్రీ కోర్టువారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 18-6-2024

ఆలపాటి కళ్యాణ్‌చరణ్,
వాది తరఫు అడ్వకేట్,
అరండల్‌పేట, గుంటూరు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ అయిన పల్నాడు జిల్లా, నరసరావుపేట మండలం కేసానుపల్లి గ్రామ కాపురస్తులు షేక్ నాసర్ గారి కుమారుడు షేక్ ఖతీఫ్ హుస్సేన్ గారి నుంచి సమాచారం పొంది యావన్మందికి తెలియజేయడం ఏమనగా

మా క్లయింట్ తాలూకు పల్నాడు జిల్లా, నరసరావుపేట మండలం, కేసానుపల్లి గ్రామం తాలూకు నా వగైరాలు ది ప్రిన్సిపిల్ సబార్డినేంట్ జడ్జి కోర్టు నరసరావుపేటలో ఓ.యస్.నెం.47/80, ఇ.పి.నెం.42/81 రు, ఇ.ఎ. నెం,10/96 ర్లుగా జరుపుకొన్న దావా ప్రకారం వారికి సంబందించిన జడ్జ్ మెంట్లో వివరించిన విధంగా సేల్ సర్టిఫికేట్ ద్వారా డి.నెం. 185/3 రు, య. 1-99 1/2ట్లు, దస్తావేజుల నెంబరు ద.నెం. 8413/2000 రు ద్వారా నేను సంపూర్ణహక్కుభుక్త స్వాధీనఅనుభవములు కలిగి ఉన్నాను.

కావున ఈ ఆస్తికి సంబంధించిన ఓ.యస్.నెం. 47/80, తాలూకు 1వ పుస్తకం, వాల్యూం నెం.1306 రు, 313 పుటలలో గల సేల్ సర్టిఫికేట్ కేసానుపల్లి నుండి నరసరావుపేట జిరాక్స్ కొరకు వస్తుండగా మార్గమధ్యములో ఎక్కడో పడిపోయినవి ఎంత వెతికినా కనిపించలేదు సదరు విషయమై నరసరావుపేట తాలూకు పోలిసు వారికి పిరియాదు చేసియున్నాము. ఎవ్వరికైన దొరికినచో ఈ క్రింద తెలిపిన అడ్రసు తెలియ చేయవలను, సదరు ఓ.యస్.నెం.47/80, తాలూకు 1వ పుస్తకం, వాల్యూం నెం.1306 రు, 313 పుటలలో గల సేల్ సర్టిఫికేట్ ద్వారా ఎవరైనా ఏ విధమైన లావాదేవిలు జరిపిన యెడల అట్టి లావాదేవీలు అన్నియు నా క్లయింట్ను ఏ విధంగా బద్దుడానూ చేయజాలనవి ఇందు మూలముగా యావన్మందికి తెలియచేయడమైనది.మరియు అట్టి ఆస్తి బదిలీ చేయు విషయములో ఏవైనా పేచీలు సమస్యలు అభ్యంతరములు ఉన్నచో వెంటనే యీదిగువ అడ్రస్కు తెలియ పరచవలిసినదిగా కోరుచున్నాము.

ఇట్లు,
సింగం చంద్రశేఖర్
వై. సురేష్ బాబు,
డి.మస్తాన్‌రావు
అడ్వకేట్స్, నరసరావుపేట.
సెల్ : 95734 27200, 98665 63697
8179261369.

సమను
IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE: NARASARAOPET
O.S.NO.16/2023

Between:
Pathri Anil Kumar ... Plaintiff
And
01. Gopu Rami Reddy,
02. Gopu Ramanamma,
03. Gopu Ramana Reddy,
04. Gopu Rajamatha,
05. Doppalapudi Balagangadhar Thilak
... Defendants

To
D1- Gopu Rami Reddy, S/O China Venkateswara Reddy @ Venkateswara Reddy, Hindu, aged about 61 years, cultivation,
D2- Gopu Ramanamma, W/O Rami Reddy, Hindu, aged about 55 years, Cultivation,
Both are Residing at Door No. 5-38, Near Ramalayam Temple, Veeravatnam Village, H/O Thurumella Village, Rompicherla Mandal, Palnadu District.

పై నెంబర్ దావాలో శ్రీ కోర్టువారు అనేక పర్యాయములు కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా సమనులు పంపినప్పటికి సదరు సమన్లను మీరు తీసుకోకపోవడంతో పై నెంబర్ దావాలో శ్రీకోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా ప్రతివాదికి సమను జారీచేసియున్నారు. కావున సదరు ప్రతివాది ది.18.06.2024వ తేదిన ఉదయం 10-30 ని॥లకు పై కోర్టువారి ఎదుట స్వయముగా గానీ న్యాయవాది ద్వారా గానీ హాజరు అయి ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలసినదనీ లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమందు తీర్మానించబడుననీ ఇందు మూలంగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా తేది:18.06.2024.

నల్లిబోయిన ఆంజనేయులు,
వాది తరుపు న్యాయవాది,
సత్తెనపల్లి-522403.

ప్రజాశక్తి
www.prajasakti.com
గుంటూరు జిల్లా
పల్నాడు జిల్లా

చదువుల ఖిల్లా సత్తెనపల్లి విద్యారంగం ప్రత్యేకం

చదువుల ఖిల్లాగా ఖ్యాతి గడించిన సత్తెనపల్లిలో పలు విద్యా సంస్థలు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి కృషి చేస్తున్నారు. వేలాది మంది విద్యార్థులను అక్షర యోధులుగా తీర్చిదిద్దిన ఘనతను సొంతం చేసుకున్నారు. సత్తెనపల్లి కేంద్రంగా సుమారు వంద గ్రామాల్లో విద్యార్థులు ఉన్నత భవితవ్యానికి నాందికి శ్రీకారం చుట్టారు. నేటి విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులను గమనిస్తూ దానికి అనుగుణమైన విద్యా బోధనతో విద్యార్థులను జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో కొలువులకు సిద్ధం చేస్తూ సత్తెనపల్లి విద్యా ఖ్యాతి జెండాను రెపరెపలాడిస్తున్నారు. ఉద్యోగకల్పన కూడా వారి భాద్యతగా గుర్తిస్తూ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ పేరొందిన కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించటంలో విశేష కృషి చేస్తున్నాయి. పలు విద్యాసంస్థలు తమ అభిప్రాయాలను ప్రజాశక్తి ద్వారా ప్రత్యేకంలో తెలిపారు. (ప్రజాశక్తి - సత్తెనపల్లి, సత్తెనపల్లిటౌన్)

దినదినాభివృద్ధి చెందుతున్న కృష్ణవేణి విద్యాసంస్థలు

ప్రజాశక్తితో కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు

వీరవల్లి శ్రీనివాసరావు
కృష్ణవేణి సంస్థల డైరెక్టర్

విద్యా సంస్థను స్థాపించిన 21 ఏళ్ల నుండి ఇప్పటి వరకూ సత్తెనపల్లి పట్టణంలో అత్యధిక ఉత్తీర్ణత శాతం, టాప్ మార్కులు, టౌన్ ఫస్ట్ సాధిస్తూ దినదినాభివృద్ధి చెందుతున్న సంస్థ తమదని కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు అన్నారు. కృష్ణవేణి విద్యాసంస్థలు స్థాపించి 21 ఏళ్లయిన సందర్భంగా ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు. 11 ఏళ్ల నుండి ఇంటర్ తో పాటు ఎంసెట్ బోధిస్తున్నామని, పల్నాడు డివిజన్లోనే సింగిల్ మేనేజ్‌మెంట్‌తో కళాశాలను నిర్వహిస్తూ దానికి అనుబంధంగా సత్తెనపల్లి, మాచర్ల పట్టణాలలో ఎస్‌విఆర్ డిగ్రీ కాలేజీని స్థాపించి డిగ్రీ వ్యవస్థలోనూ యూనివర్సిటీ స్థాయిలో ర్యాంకులు, ప్రతిభ అవార్డులను సాధించి పట్టణంలోనే బెస్ట్ డిగ్రీ కాలేజీగా పేరు సంపాదించుకున్నామని వివరించారు. సత్తెనపల్లి పట్టణం, పరిసర ప్రాంతాల్లోని సుమారు 100 గ్రామాల నుండి విద్యార్థులు తమ కళాశాలలో విద్యను అభ్యసించినట్లు తెలిపారు. విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందితో మెరుగైన విద్యాబోధన అందిస్తున్నట్లు చెప్పారు. విద్యతోపాటు క్రీడలు వ్యక్తిత్వ వికాసం పలు వాటిని అందిస్తున్నామన్నారు.

విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సహకారం ఉన్నంతవరకు విద్యాభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలిపారు. తమ విద్యాసంస్థల్లో చదివిన వారు సబ్ కలెక్టర్ నుండి బ్యాంకింగ్ రంగం, ఐటి, ఫార్మా తదితర రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. 500 పైగా మార్కులు సాధించిన వారికి ఉచిత విద్యనందిస్తూ విద్యాభివృద్ధికి తమ వంతు సహాయం అందిస్తున్నామని చెప్పారు. పేద విద్యార్థులకు మానసిక స్థైర్యాన్ని పెంపొందించి ప్రత్యేక కౌన్సిలింగ్ ఇస్తున్నామని, పేద విద్యార్థులకూ కార్పొరేట్ విద్యను అందించడం కృష్ణవేణి విద్యాసంస్థలకే సాధ్యమని అన్నారు. పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా విద్యార్థులు ఉన్నత రంగాల్లో రాణించేందుకు దోహదం చేస్తున్నామని అన్నారు.

రూ .13.52కోట్లతో పాఠశాలల అభివృద్ధి పనులు : ఎంఇఒ

శ్రీనివాసరావు, ఎంఇఒ

మండలంలో మొత్తం 82 పాఠశాలకు సంబంధించి నాడు నేడు పథకం క్రింద రూ .13.52 కోట్లు ఖర్చు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన ఇప్పటి వరకు జరిగిన పనులకు సంబందించిన వివరాలు తెలిపారు. నాడు నేడు పనులలో భాగంగా ప్రభుత్వం రెండు ఫేజ్లుగా పనులు విభజించి పనులు ప్రారంభం చేసినట్లు అయన తెలిపారు. అందులో భాగంగా మొదటి ఫేజ్‌లో భాగంగా రూ 3.95కోట్లు మంజూరు అయ్యాయి అన్నారు. రెండవ ఫెజ్‌లో రూ రూ 9.52 కోట్లు మంజూరు అయ్యాయి అన్నారు. నాడు నేడు పనులను మూడు బాగాలుగా గుర్తించటం జరిగింది అన్నారు. 1సివిల్ వర్క్స్, 2 అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్స్, ఈ పనులు కూడా పేరెంట్స్ కమిటీ, ఇంజనీరింగ్ అధికారులు కలిసి ఎక్కడ ఏ అవసరం ఉందొ గుర్తించి వాటిని నాడు నేడు క్రింద పెట్టటం జరిగింది అన్నారు. అదేవిధంగా మరుగుదొడ్లు, శానిటేషన్ తదితర అంశాలు ఇందులో ఉన్నాయు అన్నారు. కాగా ఇప్పటికే మొదటి ఫెజ్ పూర్తికగా రెండవ ఫేజ్‌లో కూడా పనులు చివరికి చేరాయి అన్నారు. పాఠశాలను ఆధునికరించిన నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య కూడా బాగా పెరిగింది అన్నారు. విద్యార్థులకు తగ్గట్టుగానే ఉపాధ్యాయులు కూడా ఉన్నారు అన్నారూ. కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వపాఠశాలతో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బోధనతో విద్యా ర్థుల నుండి మెరుగైన ఫలితాలను సాదిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ప్రభుత్వం కల్పనతో విద్యార్థులు ప్రభుత్వం పాఠశాలలో విద్యను అభ్యశించాటానికి ఇష్టపడుతున్నారు అన్నారు. విద్యారంగంలో ఇదొక శుభ పరిణామం అన్నారు.

విద్యారంగంలో 38 వసంతాలు హోలీ ఫ్యామిలీ

10 ఫలితాల్లో నూరు శాతం విజయం

సిస్టర్ విజయరాణి, ప్రిన్సిపల్

పట్టణంలోని ప్రధాన రహదారి వెంట సువిశాలమైన భవంతులతో, విశాలమైన గదులతో, అహ్లాదకరమైన వాతావరణంలో 1986లో హోలీఫ్యామిలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ స్థాపితం చేసి పట్టణ పరిసర ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నట్లు పాఠశాల ప్రధాన ప్రిన్సిపాల్ సిస్టర్ విజయరాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది పది పరీక్షలకు 57 మంది విద్యార్థులు హాజరు కాగా 100శాతం ఉత్తీర్ణత సాధించటం సంతోషకరం అన్నారు. అయితే తమ పాఠశాలలో విద్యతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్, స్పోర్ట్స్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను విద్యార్థులకు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి ఏడాది వెయ్యి మంది విద్యార్థులు తమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నట్లు ఆమె తెలిపారు. నేడు విద్యా వ్యవస్థలో పోటీతత్వం నెలకొందని, ఈ నేపథ్యంలో ఆ పోటీ తాత్వానికి దీటుగా విద్యార్థులను తయారు చెయ్యవలసిన గురుతర భాద్యత తమపైన ఉందన్నారు. మెరుగైన విద్యాభోదనే లక్ష్యంగా అనుభవజ్ఞులైన బోధన సిబ్బందితో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు ఆమె తెలిపారు . తల్లిదండ్రులు విద్యార్థుల ప్రోత్సాహంతో మెరుగైన ఫలితాలు సాధించనున్నట్లు ఆమె తెలిపారు.

పది ఫలితాల్లో ప్రభంజనం యూనిక్ కాన్సెప్ట్ స్కూల్

లిఖిత గాయిత్రి 1

నల్లగొర్ల హర్షిత 2

మేరుగ దివ్య తులసి 3

శేఖమూరి సుజాత, కరస్పాండెంట్

పది ఫలితాలాలో నూటికి నూరుశాతం విజయం సాధించటం తమకు ఎంతో సంతృప్తిని కల్గించిందని యూనిక్ కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ ఎస్ సుజాత నారాయణ అన్నారు. స్కూలు గురించి పలు వివరాలు ఆమె తెలిపారు. 2009లో స్థాపించిన తమ పాఠశాలలో విద్యార్థులకు విశాలమైన తరగతి గదులను ఏర్పాటు చేసి, ఉత్తమ అధ్యాప కులచే బోధన అందిస్తున్నాం అన్నారు. ప్రస్తుతం విద్యారం గంలో పోటీని గమనిస్తునే తమ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఎప్పటికి కప్పుడు విద్యార్థుల నుండి మెరుగైన ఫలితాలను సాధిస్తూ ఉత్తమ విద్యా సంస్థగా మొదటి శ్రేణిలో ఉండాలని కృషి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది పది పరీక్షలకు 50మంది విద్యార్థులు హాజరుకాగ 48 మంది పాసయ్యారన్నారు. పదిలో అత్యధిక

మార్కులు సాధించిన వారిలో ఎన్.లిఖిత గాయత్రి 591/600, ఎన్.హర్షిత 588, ఏం దివ్యతులసి 581,సాధించి పాఠశాలకు ఘన కీర్తితో పాటు వారి ఉజ్వల భవిష్యత్‌నకు మార్గం వేసుకున్నారని అన్నారు. వీరందరికి కూడా ట్రిపుల్ ఐఐటి సీటు తప్పక వస్తుందని, గతంలో కూడా తమ పాఠశాల నుండి కొందరు విద్యార్థులు ట్రిపుల్ ఐఐటి సీటు పొంది నేడు ఉన్నత కొలువులు చేస్తున్నట్లు ఆమే తెలిపారు. సిబిఎస్‌సి సిలబస్ స్థాయిలోనే విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు.

సిబిఎస్ఇ విద్యతో విద్యార్థులకు మెరుగైన భవిషత్తు

ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ మక్కెన అచ్చయ్య

మక్కెన అచ్చయ్య

నేడు విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యా బోధనను విద్యార్థులకు అందించటంలో తమ ప్రగతి హైస్కూల్ విద్యా సంస్థల ప్రత్యేకత చాటుకుందని ప్రగతి విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మక్కెన అచ్చయ్య తెలిపారు. సుదీర్ఘ కాలంగా తమ విద్యా సంస్థ ద్వారా వేలాది విద్యార్థులకు విద్యను అందించాం అన్నారు. తమ పాఠశాలలో విద్యను అభ్యసించిన ఎందరో విద్యార్థులు నేడు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు అన్నారు. ప్రస్తుతం తమ పాఠశాలలో సిబిఎస్ఇ విద్యా బోధన అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. సిబిఎస్ఇ బోధనకు ప్రభుత్వం నుండి ప్రత్యేక అనుమతులు పొందాలి అన్నారు. రెండు ఎకరాల స్థలం ఉండాలి, 5కిమీ దూరంలో ఆటస్థలం ఉండాలి, పాఠశాల బిల్డింగ్ ఆ ఆవరణలోనే ఉండాలి, ఉపాధ్యాయులు బోర్డు నుండి 8రోజులు శిక్షణ పొందాలి అనే నిభంధనలు ఉన్నాయి అన్నారు. అయితే సిబిఎస్ఇ ఒకటోవ తరగతి నుండే అమలు చేస్తే విద్యార్థి భవిషత్తు బంగారుమయం అవుతుంది అన్నారు. దీనిలో ప్లస్ 1, ప్లస్ 2 పద్దతిలో బోధన ఉంటుంది అన్నారు. సిబిఎస్ఇలో ఊహజనితపై విద్యార్థులకు బోధన ఉంటుంది అన్నారు. ఆంగ్ల బోధన విధిగా ఉండటం వలన ఆంగ్లం

మాట్లాడటం విద్యార్థులు అలవర్చుకుంటారు అన్నారు. ఇప్పటికి 32మంది సిబిఎస్ఇ పరీక్షలు వ్రాస్తే అందరు పాస్ అయినట్లు అయిన తెలిపారు. విద్యను అభ్యశించటం ఒక భాగమైతే బయటకు వచ్చిన అనంతరం ఉద్యోగ సాధనలో విఫలం అవుతున్నారు దీనికి కారణం స్కిల్ డెవలప్మెంటులో తగినంత సామర్థ్యం లేక పోవటం ప్రధాన సమస్య అన్నారు . కాని సిబిఎస్ఇ బోధనలో ప్రధమ స్థాయినుండే ఆంగ్లంపై పట్టు కల్గివుండటంతో ఈ సమస్యలను అదిగమించి ముందుకు పోయే అవకాశలు ఉన్నాయి అన్నారు. తల్లిదండ్రుల సహాయ సహకారాలు ఉంటే విద్యార్థుల లక్ష్యాలు ఫలిస్తాయి అన్నారు.

ప్లేస్మెంట్స్‌తో విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు

ప్రగతి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలల డైరెక్టర్ పరిటాల నరేష్

పరిటాల నరేష్, డైరెక్టర్

ప్రగతి విద్యా సంస్థల్లో ఒకటైన ప్రగతి ఇంటర్ కాలేజీని 2002లో స్థాపన చేసి సుమారు 22 సంవత్సరాలు విద్యా పయనంలో తమదైనా ముద్ర వేసుకొని ఎందరో విద్యార్థులకు ఉన్నత భవిష్యత్‌లకు మార్గాలు వేసినట్లు ప్రగతి కళాశాలల డైరెక్టర్ పరిటాల నరేష్ ఆనందాన్ని వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా ఆయన కళాశాలకు సంబందించిన పలు విషయాలను వెల్లడించారు. విద్య ఒక్కటే విద్యార్థుల భవితవ్యాన్ని మెరుగుపర్చలేవు అన్నారు . నేటి పోటీ ప్రపంచంలో విద్యా పూర్తి చేసిన విద్యార్థులు బయట ప్రపంచంలో ఎదురౌతున్న సవాళ్ళను అడిగామించ లేకపోతున్నారు అన్నారు . ఈ పరిస్థితులను విద్యార్థులు అడిగమించాలనే లక్ష్యంతో విద్యలో పెను మార్పులు తీసుకొచ్చం అన్నారు . అందులో భాగంగా 2010లో డిగ్రీ విద్యను ప్రారంభించి సిజిపి (కెరీర్ గ్యారెంటీ ప్రోగ్రాం) ను అందుబాటులోకి తెచ్చాం అన్నారు . ఈ ప్రోగ్రాం ద్వారా ఇప్పటికి 72మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశలు కల్పించటం జరిగింది అన్నారు . నేడు తల్లిదండ్రులలోను , విద్యార్థులకు ఎం చదవాలి అనే విషయంలో కొంత అవగాహన లేకపోవటం తమ ఇష్టాలను తమ పిల్లలపై బలవంతంగా రుద్దటంతో విద్యార్థి భవిషత్తు ప్రశ్నర్తకంగా మారుతుంది అన్నారు . ఈ పరిస్తుతులను తాము స్వయంగా గమనించటంతో తమ కాలేజికి చేరెందుకు తీసుకొచ్చే తల్లిదండ్రులతో ముందుగా మాట్లాడటం జరుగుతుంది అన్నారు . అనంతరం విద్యార్థితో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి విద్యార్థి ఇష్టాలను దేనిపట్ల ఆ విద్యార్థికి ఆసక్తి ఉంది అనే విషయాలను మేము గుర్తించి వారిని జాయిన్ చేసుకోవటం జరుగుతుంది అన్నారు . ఈ ప్రోగ్రాం ద్వారా ప్రతి విద్యార్థి సులభంగా ఇంగ్లీష్ మాట్లాడటం సులభతరంగా ఉంటుంది అన్నారు . ఆంగ్లం పై ఎప్పుడైతే పట్టు వస్తుందో అప్పుడు ఏ ఇంటర్వ్యూ అయినా సమర్థవంతంగా ఎదుర్కంటారు అన్నారు .మా కాలేజీలో చదివిన ప్రతి విద్యార్థికి వారివారి సామార్థ్యలను బట్టి ఉద్యోగ అవకాశలు కల్పిస్తాం అన్నారు . ఇప్పటికే ఎన్నో మల్టినేషన్ కంపెనీలలో. తమ విద్యార్థులు వివిధ హొదాల్లో ఉద్యోగాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు . విద్యా , ఉద్యోగం ఇదే మా కళాశాల నినాదం అన్నారు . ఇప్పటికే మా కళాశాల నుండి 18 మంది విద్యార్థులు పేరొందిన కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నారు అన్నారు .ప్రతి డిగ్రీ విద్యార్థి నూరుశాతం ఉద్యోగ కల్పన మా విధిగా పెట్టుకున్నాం అన్నారు . విద్యార్థులకు 48ఒరియేంటేషన్ ప్రోగ్రాం డిజైన్ చేయటం జరిగింది అన్నారు . తల్లిదండ్రులు చైతన్యంతోనే విద్యార్థులకు ఉన్నత భవిషత్ సాధ్యం అన్నారు . ప్రతి విద్యార్థిలో వారికే తెలియని పరిజ్ఞానం ఉంటుంది దాన్ని గుర్తించి వెలుగులోకి తీసుకరావటంలో తాము ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు.

నర్సరీ నుండి 10వ తరగతి వరకు .. అభివృద్ధి పథంలో డాక్టర్ జేమ్స్

డాక్టర్ జేమ్స్ స్కూల్ అచ్చంపేట రోడ్డులోని గండ్లూరు అడ్డరోడ్డు వద్ద 2016లో ప్రారంభించినట్లు స్కూల్ డైరెక్టర్ రవిచంద్ర తెలిపారు. ఇటీవల ఆయన ప్రజాశక్తి కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విధంగా మాట్లాడారు. నర్సరీ నుండి పదవ తరగతి వరకు బోధిస్తున్న ఈ స్కూలు నాటి నుండి నేటి వరకు దినదినాభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. తమ స్కూలుకి విశాలమైన తరగతి గదులు, ఆహ్లాదకరమైన వాతావరణం ప్లే గ్రౌండ్ వంటి మంచి మంచి సదుపాయాలు కలవని ఆయన తెలిపారు. తమ స్కూలులో మంచి అనుభవం, మరియు విద్యార్హత కలిగిన క్వాలిఫైడ్ అధ్యాపకులు చే విద్యా బోధన జరుగుతుందని ఆయన తెలిపారు. డిజిటల్ క్లాస్ రూమ్స్ మరియు 45 సీటర్ కలిగిన కంప్యూటర్ ల్యాబ్, బస్సు సౌకర్యం ఉన్నదని తెలిపారు. తమ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు మంచి విద్యాబోధన క్రమశిక్షణ అందించడం జరుగుతుందని అన్నారు. ఆరవ తరగతి నుండి ఐఐటి, నీట్‌లలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు విద్యుత్‌తో పాటు కరాటే క్విజ్ కాంపిటేషన్ కల్చరల్ యాక్టివిటీస్ వంటి ప్రోగ్రాములు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

రైతులు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలి

వ్యవసాయ శాఖ ఎఓ లక్ష్మారెడ్డి

ప్రజాశక్తి-మాచర్ల

రైతులు విత్తనాలు కొనుగోలు చేయగానే తప్పనిసరిగా వ్యాపారుల నుండి బిల్లులు తీసుకోవాలని వ్యయసాయశాఖ ఎఓ లక్ష్మారెడ్డి సూచించారు. పట్టణంలో సోమవారం ఉదయం పలు విత్తనాల షాపుల్లో ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఓ మాట్లాడుతూ రైతులు సదరు విత్తనాల బిల్లులను పంట కాలం పూర్తి అయి, పంట చేతికి వచ్చే వరకు భద్రపర్చుకోవాలన్నారు. షాపుల వారు నిబంధనలను ఉల్లఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చిత్రం

జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి.. నాయకుల నివాళి

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

దేశ మొదటి ప్రధాని స్వర్గీయ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 60 వ వర్ధంతి కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. సత్తెనపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన వర్ధంతి కార్యక్రమానికి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి జ్ఞానరాజు పాల్ అధ్యక్షత వహించారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుక్కా చంద్ర పాల్ మాట్లాడుతూ సామ్యవాద సిద్ధాంతా లతో కూడిన పంచవర్ష ప్రణాళిక అమలు చేయడం ద్వారా దేశం ఎంతో పురోగతి సాధించిందని అన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి ఎం.వేదాద్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ అజీమ్, కాంగ్రెస్ పార్టీ ముప్పాళ్ళ,రాజుపాలెం,అచ్చంపేట మండలాల అధ్యక్షులు వరుసగా కె.ఆనంద్, షేక్ ఆరిఫ్, కె.సాంబశివరావు ,షేక్ సుభాని పాల్గొన్నారు.

'డ్వాక్రా డబ్బులూ కొట్టేసిన ఏకైక ప్రభుత్వం'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్త్రీ నిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ నుంచి రూ.వందల కోట్లను జగన్ ప్రభుత్వం స్త్రీనిధి నుంచి దారి మళ్లించి న రూ.750 కోట్లు ఏమీ చేశారో ప్రభుత్వమే చెప్పాలని టిడిపి-జనసేన-బిజెపి కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక పండరీ పురంలోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చివరకు కార్పొరేషన్లు, విద్యా సంస్థల నుంచి కూడా వందల కోట్లు దోచేశారని ఆరోపించారు. ఎపి స్టేట్ ఫైనాన్షిల్ సర్వీసెస్ కార్పొరేషన్ ద్వారా రూ.4,736 కోట్లను ప్రభుత్వం గోల్‌మాల్ చేసిందని, రెండున్నరేళ్ల క్రితమే కాలపరిమితి ముగిసిన డిపాజిట్లు ఎందుకు ఇవ్వలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 33 ప్రభుత్వ శాఖలు ప్రభుత్వరంగ సంస్థల నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. ఎన్నికల ఫలితాలు వెలువడే లోపు ప్రతి పైసాకు జగన్ సర్కారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

తాటి ముంజలు .. పెరిగిన అమ్మకాలు

- **వేసవి తాపానికి ఉపశమనం**
- **ముంజలతో ఆరోగ్య ప్రయోజనాలు**
- **కొనుగోలుకు ప్రజల ఆసక్తి**



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కల్తీలేనివి, స్వచ్ఛమైనవి, నోరూరించే తాటిముంజలకు డిమాండ్ బాగా పెరిగింది. వేసవిలో మాత్రమే లభించే తాటి ముం జలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. తాటి ముంజలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలెన్నో ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకే, వీటిని కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చెబుతున్నారు.మండల కేంద్రాల్లో, గ్రామాల్లో, పట్టణాలలో తాటి ముంజలకు డిమాండ్ బాగా పెరిగింది. విక్రయదారులు వాటిని పెట్టిన గంటల వ్యవధిలోనే అమ్ముడుపోతున్నాయని చెబుతున్నారు. తాటి ముంజలు కొనుగోలు చేయడానికి ప్రజలు గంటలు తరబడి కూడా వేచి చూస్తున్నారు. ప్రస్తుతం పట్టణాలతో పాటు రద్దీ ప్రదేశాలలో వీటిని విక్రయిస్తున్నారు. ప్రధానంగా నరసరావుపేటలోని గడియార స్తంభం సెంటర్, మల్లమ్మ సెంటర్, స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాలలో గ్రామీణ ప్రాంతాల నుండి ద్విచక్ర వాహనాలపై ఆటోలలో తీసుకు వచ్చి, కొనుగోలు చేసే వారి ముందే తాటి కాయలు కోసి తాజా ముం జలు విక్రయిస్తున్నారు. 12 తాటి ముంజలను రూ.80 నుండి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. తాటి ముం జలకు మంచి ఆదరణ లభిస్తుండడంతో ఎక్కువ శాతం విక్రయాలు సాగుతున్నాయి. తాటి ముంజల విక్రయం ద్వారా వేసవి కాలంలో ఉపాధి పొందుతున్నామని అమ్మకం దారులు తెలిపారు.

ఎండాకాలం ఎంతో చలువ

తాటి ముంజలు తింటే ఎండ దెబ్బ తగలకుండా చల్ల దనంగా ఉం టుందని వైద్యులు చెబుతున్నారు. ఎండాకాలంలో మని షికి అలసట రాకుండా, డీహైడ్రేషన్ బారినపడకుండా ఉండేందుకు ముంజలు ఉప యోగపడతాయి. గర్భిణులు సైతం వీటిని తినొచ్చు. ముఖ్యంగా మనిషి బరువును తగ్గించడంలో ముంజలు ఎంతో దోహద పడతాయి. తాటి ముంజలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదు

తాటి ముంజలు అమ్మడానికి ఎక్కువ శ్రమ పడాల్సి వస్తోందని విక్రయదారులు చెబుతున్నారు. తాటి చెట్టు ఎక్కి గెలలు కోయడంతో పాటు వాటిని తీసుకు వచ్చి ముంజలు బయటకు తీసి ప్రజలకు విక్రయించేందుకు చాలా శ్రమ ఉంటుందని అంటున్నారు. శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుండక పోతుండటంతో ముంజల ధర పెంచామని అన్నారు. అయితే, రాను రాను తాటిచెట్ల సంఖ్య తగ్గిపోతున్నాయని, గతంలో విరివిగా లభించే తాటి ముంజలు ఇప్పుడు తక్కువగా లభిస్తున్నాయని అన్నారు. వేసవికాలంలో ప్రతి వారం తాటి ముంజలు తీసుకువచ్చి వార సంతల్లో అమ్మేవారమని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు.

బ్యారికేడింగ్ పటిష్టంగా ఉండాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్ట్రాంగ్ రూముల నుండి ఈవీఎంలు కౌంటింగ్ హాల్ కు తీసుకెళ్లడానికి, కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్ కు వెళ్ళడానికి మార్గంలో ప్రత్యేకంగా బ్యారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాత్కర్ బాలాజీరావు పేర్కొన్నారు. సోమవారం జెఎన్‌టియు లో పార్లమెంట్, 7 అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి ఈవీఎంల భద్ర పరిరిచిన స్ట్రాంగ్ రూములను, ఓట్లు లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లను పరి శీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు -2024 కు సంబంధించి జెఎన్‌టియులో ఓట్లు లెక్కింపు నిర్వహించనున్నట్లు చెప్పారు. స్ట్రాంగ్ రూముల వద్ద మూడు అంచెల భద్రతా ఏర్పాటు చేయడం, ఓట్లు లెక్కింపు ప్రక్రియ పూర్తి అయ్యే వరకు గట్టి బందోబస్తు ఉంటుందన్నారు.

7 అసెంబ్లీ నియో జకవర్గాలకు, పార్లమెంటు నియోజవర్గానికి విడివిడి గా ఓట్లు లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశామని,ఓట్లు లెక్కింపు కేంద్రాలకు వెళ్లేందుకు, ఈవీఎంలను తీసు కెళ్లేందుకు అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు వెళ్లేందుకు ప్రత్యేకంగా బ్యారికేడింగ్ ఏర్పాట్లను ఆర్ అండ్ బి అధికారులు సమన్వయంతో చేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో సిసి కెమెరాలు,కంట్రోల్ రూమ్ లో టి వి లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పార్లమెంట్,

కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్

ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్స్ బాక్స్ లు భద్రపరిచి స్ట్రాంగ్ రూములను, పరిశీలిం చారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు, ఎస్ఇఆర్ అండ్ బి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రాండమైజేషన్ ప్రక్రియపై అవగాహన

కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో శ్రీకేష్ లాత్కర్ బాలాజీరావు రాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె. వినాయకం, డిఎఒ భాస్కర్ రెడ్డి, ఎన్ఐసి అధికారి జగన్మోహన్ పాల్గొన్నారు.

గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

అడిషనల్ ఎస్పీ ఏపీబివి ప్రసాద్

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు క్రైమ్ అడిషనల్ ఎస్పీ ఎపిబివి ప్రసాద్ అన్నారు.సోమవారం మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు.గ్రామ పుర వీధుల్లో తిరుగుతూ ప్రజలను చైతన్య పరిచారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు సమన్వయం పాటించాలని సూచించారు. గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు తెలియపరచాలని ఆయన కోరారు. అనంతరం స్థానిక పోలీసులకు పలు సూచనలు చేశారు. ఉదయం మాచర్ల రూరల్ సిఐ కె.సురేష్ ఆధ్వర్యంలో తాళ్లపల్లిలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్ లో సరైన పత్రాలు లేని మూడు బైక్ లను స్వాధీన పరచుకున్నారు. నెల్లూరు ట్రాఫిక్ డిఎస్పీ ఎ.శ్రీనివాస్, విజయపురిసౌత్ ఎస్ ఐ పట్టాభి రామయ్య, ఎఎస్ఐ సోమ్లా నాయక్, పాల్గొన్నారు.

నూరు శాతం సబ్సిడీపై పండ్ల తోటలు

ప్రజాశక్తి -పెదకూరపాడు

పండ్ల తోటలు వేసే చిన్న సన్న కారు రైతులకు నూరు శాతం సబ్సిడీ వర్తిస్తుందని జిల్లా డోమ పిడి జోసఫ్ అన్నారు. సోమవారం మండలంలోని జలాల్పురం, పాటిబండ్ల గ్రామాలలో పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకోవాలని కోరారు. దానివల్ల ప్రయోజనాలు కూడా ఉంటాయన్నారు. ఫామ్ పాండ్ వేయించు కునే రైతులు పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏపివో కోటేశ్వరావు సిబ్బంది పాల్గొన్నారు.

చదివించే బాధ్యత తల్లిదండ్రులదే

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పిల్లలను చదివించటం తల్లిదండ్రుల బాధ్యతనీ బడి బయట ఉన్న పిల్లల అందరిని బడిలో చేర్పించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం నందిగామ ఎస్సీ కాలనీల విద్యా చైతన్య ప్రచా రోద్యమ కార్యక్రమం నిర్వహించారు. చిన్నప్ప మాట్లాడుతూ విద్య ద్వారానే గౌరవం, గుర్తింపు లభించిస్తుందని, అందరికీ సమాన అవ కాశాలు ఉంటాయని అన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుకలు పొందాలని విజ్ఞప్తి చేశారు.

గాయపడ్డ వారికి ఆర్ధిక సాయం

ప్రజాశక్తి-మాచర్ల

పోలింగ్ రోజున వైసిపి నాయకుల హిం సలో గాయపడ్డ పలువురికి ర్థిక సాయం అందించి నట్లు పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు తెలిపారు. పిడబ్ల్యుడి కాలనీలో సీనియర్ నాయకులు కేశవరెడ్డి కార్యాలయం వద్ద జరిగిన దాడిలో గాయపడ్డ తురకా శివశ్రీను, తురకా నాగరాజులకు రూ .5వేలు చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు బి. వీరాంజనేయు లుకు క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, సిహెచ్ హరిబాబు, మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు, బి.భవానీశంకర్,సతీష్‌కుమార్, డి.వెంకటేష్ పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు రైతు సన్నద్ధం

- మండల పరిధిలోని 22 ఎకరాల మాగానీ భూములు
- క్యాచ్ మెంట్ వాటర్, పట్టిసీమ నీటిత పంటలకు సాగునీటి అవకాశం

ప్రజాశక్తి-దుగ్గిరాల

తొలకరి జల్లు కురిసింది. పుడిమి తల్లి తడిసి ఖరీఫ్‌కు సన్నద్ధమైంది. నైరుతి రుతు పవనాల రాకతో కురిసే మొట్టమొదటి వర్షాన్ని తొలకరి అంటారు. తొలకరి ఖరీఫ్ పంటకు నాంది పలుకుతుంది. రుతు పవనాల రాక నుండి తిరోగమనం వరకు పండే పంటను ఖరీఫ్ అంటారు. వాయు గుండం ప్రభావం వలన ముందే వర్షాలు కురవడంతో డెల్టా ప్రాంతంలో రైతులు ఉత్సాహంగా ఉల్లాసంగా ఖరీఫ్‌కు సన్నద్ధ మవుతున్నారు. చేలు దున్నేందుకు సన్నద్ధ మయ్యారు. వర్షాకాలం ప్రారంభంలో విత్తనాలు విత్తి అంతంలో పంట పండిస్తారు. డెల్టా ప్రాంతంలో సహజంగా జూన్ నుండి జనవరి వరకు ఖరీఫ్ సాగుతుంది. ఖరీఫ్‌లో పండే పంటల్లో వరి ప్రధానం. తేమతో కూడిన వేడి వాతావరణం నల్లరేగడి భూములు వరి పంటకు అనుకూలం. వ్యవసాయ రంగంలో ఎంత అభివృద్ధి చెందినప్పటికీ ప్రకృతిపై ఆధారపడక తప్పడం లేదు. సకాలంలో వర్షాలు కురవక పోతే డ్యాములు నిండవు కాలువలు నదుల్లో ప్రవాహం లేకపోతే భూగర్భ జలాలు సైతం అడుగంటి పోతాయి. గత రెండు రోజులు కురిసిన వర్షాలకు చేలు చేలు తడిసి సాగుకు సిద్ధమయ్యాయి. రైతులు దుక్కులు దున్నడం బ్లేడ్లు లాగడం తదితర వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. వ్యవసాయ రంగంలో ఎద పద్ధతి (విత్తనాలు చల్లే పద్ధతి) చోటు చేసుకోవ డంతో చాలా వరకు పనులు తగ్గాయి. దిగుబడి పెరిగి, ఖర్చు తగ్గింది. మండల పరిధిలోని 22 ఎకరాల మాగానీ భూముల్లో దాదాపు 20 వేల ఎక రాల్లో ఎద పద్ధతిన సాగు చేస్తున్నారు. గత సంవత్సరం జూన్ ఆరో తేదీన పంట కాలువలకు సాగినీరు విడుదల చేశారు. అయినప్పటికీ ఎండలు

దుక్కులు దున్నుతున్న రైతులు

తీవ్రంగా ఉండటంతో జులైలో రైతులు సాగు ప్రారంభించారు. ఈ సంవత్సరం జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు రాను న్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాగునీరు ఎప్పుడు వదిలేది నిర్ణయం తీసు కోనున్నారు. ప్రస్తుతం డ్యామ్‌లలో డెల్టాకు కావలసిన మేర నీరు నిలువ లేనప్పటికీ వర్షాల వల్ల వచ్చే ప్రవాహం (క్యాచ్ మెంట్ వాటర్) పట్టి సీమ నుండి వచ్చే నీటి ద్వారా పంట చేలకు నీరు అందించే అవ కాశాలు ఎక్కువ ఉన్నాయి. అయితే, ప్రస్తుత వాతావరణ సమాచారం ప్రకారం కర్ణాటక మహారాష్ట్ర రాష్ట్రాలలో వర్షాలు కురుస్తు న్నట్లు తెలిసినది దీనితో ఆయా రాష్ట్రాలలో డ్యాములు నిండిన అనంతరం మిగులు నీటిని మన రాష్ట్రానికి వదిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అప్పటికి చేలు సాగుకు సిద్ధంగా ఉంటాయి వాతావరణ శాఖ (ఐ ఎం డి) ఈ సంవత్సరం వర్షాలు ఆశాజనకంగానే ఉంటాయని తెలిపింది. దీంతో ఈ సంవత్సరం సాగుకు ఎటువంటి ఆటంకం ఉండదని రైతులు భావిస్తున్నారు.

సిమెంటు ఫ్యాక్టరీ స్థలంలో ఉద్రిక్తత

స్థలం స్వాధీనానికి కార్మికుల యత్నం

ప్రజాశక్తి-తాడేపల్లి

కోర్టులు కార్మికులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా యాజమాన్యాలు స్పందించకపోవడంతో సోమవారం ఎసిసి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు తమకు చెందిన స్థలం స్వాధీనం చేసుకోవడానికి చదును చేసే పనులు చేపట్టారు. వెంటనే ఈ సమాచారం ఎన్ఆర్ఐలకు చేరింది. ఎన్ఆర్ఐలకు సంబంధించిన పిఆర్ఒ రాజు, ప్రసాద్ అక్కడకు చేరుకుని కార్మికులతో వాగ్వివాదానికి దిగారు. ఇది తమ స్థలం అంటూ కార్మికులను భూముల్లోకి వెళ్లవద్దని వాదనకు దిగారు. అంతేస్థాయిలో కార్మికులు కూడా గట్టిగా సమాధానం చెప్పారు. 2015లో సెంటర్ లేబర్ ట్రిబ్యునల్ కోర్టు (హైదరాబాద్) కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు మొత్తం 43 కోట్ల రూపాయలు ఇవ్వమని మొదటి ఆర్డర్‌గా తీర్పు వెలువరించిన సంగతిని కార్మిక నాయకులు ఎన్ఆర్ఐల దృష్టికి తీసుకొచ్చారు. రెండో తీర్పు 2002-14 వరకు ఎసిసి భూములు అమ్మి కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు 12 శాతం వడ్డీతో కలిపి చెల్లించమని తీర్పు వెలువరించిన సంగతిని గుర్తు చేశారు. కోర్టు తీర్పు ప్రకారం 42,93,69,817 రూపాయలు స్థల యజమాని సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులకు చెల్లించాలని సెంటర్ లేబర్ కోర్టు తీర్పు స్పష్టంగా ఉంటే భూమి మీద హక్కు తమకు కాక ఎవరికి ఉంటుందని కార్మికులు ఎన్ఆర్ఐలతో వాదించారు. మీ దగ్గర ఆధారాలుంటే తీసుకురావాలని ఇదే విషయం స్థల యజమానులకు చెప్పమని కార్మికులు ఎన్ఆర్ఐలకు సూచించారు. అవన్నీ తరువాత అంటూ కార్మికులతో ఎన్ఆర్ఐల తరుపున వచ్చిన ప్రతినిధులు అర్థం పర్థంలేని వాదనలతో సిమెంటు ఫ్యాక్టరీ స్థలం వద్ద ఉద్రిక్తత సృష్టించారు. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న సిఐటియు నాయకులు వేముల దుర్గారావుపై కూడా

దురుసుగా మాట్లాడారు. ఎసిసి భూములపై ఎన్ఆర్ఐలకు ఎటువంటి హక్కులూ లేవని యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీవెన్ నిలదీశారు. కోర్టు సంబంధించిన ఆర్డర్లు ఏమైనా ఉంటే చూపించమని కార్మికులు చుట్టుముట్టారు. చివరకు వెనకడుగు వేసిన ఎన్ఆర్ఐల తరుపున వచ్చిన ప్రతినిధులు 15 రోజుల్లో భూమి యజమానులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చి అక్కడ నుంచి జారుకున్నారు. తమ కండలు కరిగించి వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను ఇప్పటి వరకు కార్మికులు సంరక్షించారని స్టీవెన్ తెలిపారు. న్యాయంగా చట్టం ప్రకారం తమకు రావాల్సిన బకాయిలు తమకు ఇవ్వాల్సిందేనని కోర్టు కూడా తీర్పు ఇచ్చిన తరువాత భూమి మీద హక్కు తమదేనని స్పష్టం చేశారు. చట్టపరంగా జరిగే ఈ పోరాటంలో విజయం తమదేనన్నారు. ఈ కార్యక్రమంలో వై.యొహోషువా, ఏసోబు, ఆసిఫ్, ఎం.గురవయ్య, ఇస్మాయిల్, సుభాని, పిచ్చయ్య, ఆశీర్వాదం, సాంబయ్య, కృష్ణ, సుబ్బులు, జాన్‌బి, ఆదిలక్ష్మి, నవనీతం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌చార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ శ్రావణ్‌బాబు

మలేరియా టెక్నీషియన్లకు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా మలేరియా అధికారి కార్యాలయంలోని లేబోరేటరీలో మలేరియా టెక్నీషియన్లకు మలేరియా మైక్రోస్కోపిక్‌పై రెండ్రోజుల శిక్షణ పున:శ్చరణ తరగతులు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఈ తరగతుల ప్రారంభానికి ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే జూన్ నెలలో వర్షాలు పడటం, తద్వారా పరిసరాలలో నీరు నిలబడడం, దోమలు గుడ్లు పెట్టడం లాంటి పరిస్థితులతో దోమలు అభివద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు. కావున ప్రతి మలేరియా టెక్నీషియన్ తప్పనిసరిగా రక్త నమూనాలను పరీక్షించి కచ్చితంగా నివేదికలు అందజేయాలని అన్నారు. తద్వారా బాధితులకు చికిత్స ఇవ్వడం సులభం అవుతుందని తెలియజేశారు. జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం మాట్లాడుతూ మలేరియా పారాసైట్ పరీక్షించడంతోపాటు, రిజిస్టర్లు, రిపోర్టులు సరైన పద్ధతిలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి రాజునాయక్, ఆరోగ్య విస్తరణ అధికారి గణేష్, మలేరియా ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకు నిలువుటద్దం శకుంతల

ప్రజాశక్తి-గుంటూరు

నిస్వార్థ సేవకు నిలువుటద్దం జనచైతన్య వ్యవస్థాపకులు మాదల శకుంతల అని ప్రముఖ పారిశ్రామికవేత్త మాదల చైతన్య కొనియాడారు. సోమవారం జనచైతన్య హౌసింగ్ ప్రైవేటు లిమిటెడ్ వ్యవస్థాపకులు మాదల శకుంతల పెద్దఖర్మ సందర్భంగా టిడిపి బిసిసెల్ ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని నిర్మల్ హృదయ్‌లో జరిగిన సేవా కార్యక్రమాల్లో మాదల చైతన్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చైతన్య మాట్లాడుతూ భౌతికంగా శకుంతలమ్మ లేకపోయినా

అన్నదానం చేస్తున్న మాదల చైతన్య, తదితరులు

తాను చేపట్టిన సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలలో శాశ్వతంగా నిలిచిపోతారని అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల పురోభివృద్ధికి శకుంతల అందించిన సేవలు మరువలేని వన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వర రావు, మాజీ కార్పొరేటర్ ముత్తినేని రాజేష్, భాష్యం నర సయ్య, జనచైతన్య ఫైనాన్స్ సిబ్బంది రవి, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావం తులకు, పేదలకు అన్నదానం చేశారు.

ప్రత్తిపాడులో పోలీసుల తనిఖీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : సార్వత్రిక ఎన్నికలక ఫలితాల విడుదల సందర్భంగా హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలను కాపాడటానికి ముందస్తు చర్యలలో భాగంగా సోమవారం ప్రత్తిపాడు నీయోజక వర్గం కేంద్రం లోని పాతమల్లాయపాలెం, ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం డి.నిసార్ బాషా మరియు ప్రత్తిపాడు ఎస్ ఐ వి సోమేశ్వర రావు ఆద్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గ్రామ పరిసరాలు, పశువుల కొట్టాలు, గడ్డి వాములు, పాడుబడిన ఇల్లు వంటి అనుమానాస్పద ప్రదేశాలను తనిఖీ చేసి, సరైన పత్రాలు లేని 8 మోటార్ సైకిల్ వాహనాలను సీజ్ చేశారు. ఫలితాల విడుదల సందర్భంగా హింసాత్మక సంఘటనలకు పాల్పడితే కఠినంగా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రధాన ప్రాంతాలలో అన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు, ఏమి చేసినా పోలీసు వారికి వెంటనే తెలిసిపోతుందని, కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు అన్యాయంగా నాశనం అవుతాయని తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

అడిషనల్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి గుంటూరు పార్లమెంట్, తాడికొండ, తెనాలి, గుంటూరు పశ్చిమ, గుంటూరు తూర్పు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు అవసరమైన 19 మంది అడిషనల్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లకు సోమవారం ఎస్.ఆర్.శంకరన్ మినీ హాల్లో ఓట్ల లెక్కింపుపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి శిక్షణా తరగతులు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఈసిఐ సూచించిన మేరకు ప్రక్రియను అవగాహన చేసుకొని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి రాష్ట్ర ఎన్నికల అధికారి తాజాగా జారీ చేసిన సూచనల మేరకు సీల్ లేదని పోస్టల్ బ్యాలెట్‌ను తిరస్కరించకుండా వాటిని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో డిఆర్ఒ పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్ స్వాతి, నోడల్ అధికారులు వీరాచారి, డిఇఒ శైలజ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎలక్షన్ కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్బీర్ సింగ్‌తో కలిసి సోమవారం న్యూఢిల్లీ నిర్వచన్ సదన్ నుండి ఐదు దశల్లో ఇప్పటివరకు ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో జూన్ 4వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపునకు ముందస్తు ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఖచ్చితమైన ఫలితాలను త్వరితగతిన ప్రకటించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. వేణుగోపాల్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సహాయక రిటర్నింగ్ అధికారి భీమారావు పాల్గొన్నారు.

శక పురుషుని శతజయంతి ముగింపు వేడుక నేడు

ప్రజాశక్తి -తెనాలి

టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల ముగింపు సభ మంగళవారం సాయంత్రం 6గంటకు స్థానిక నాజరు పేట ఎన్వీఆర్ కన్వెన్షన్ లో జరుగుతుందని పట్టణ పార్టీ అధ్యక్షులు టి హరి ప్రసాద్ తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో ఏడాదిపాటు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆలపాటి సారథ్యంలోనే ముగింపు సభ జరుగుతుందని, పార్టీ నాయకులు అభిమానులు, కార్యకర్తలు విశేషంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు.

కౌంటింగ్ సిబ్బందికి కలెక్టరేట్‌లో శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓట్ల లెక్కింపు విధులు కేటాయించిన ఉద్యోగులు బాధ్యతగా జిల్లాలోని సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో ఓట్లు లెక్కింపు విధులు కేటాయించిన ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4న, ఆచార్య నాగార్జునా యూనివర్సిటీలో జరుగుతుందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి, దాని పరిధిలోని పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు వేర్వేరుగా 14 టేబుళ్ల ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.ప్రతి టేబుల్‌కు కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలిపారు. జూన్ 3వ తేదిన జరిగే రెండవ ర్యాండమైజేషన్‌లో కౌంటింగ్ సిబ్బందికి అసెంబ్లీ నియోజకవర్గాలు కేటాయిస్తామన్నారు. కౌంటింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులు జూన్ 4వ తేది ఉదయం 5.00 గంటలకు ఖచ్చితంగా ఆచార్య నాగర్జున యూనివర్సిటీకి చేరుకోవాలన్నారు. ఈవీఎం ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు పాటిస్తూ కంట్రోల్ యూనిట్‌లో పోటీలో ఉన్న అభ్యర్థుల సీరియల్ నెంబరు వారీగా ఫలితాలను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్, మంగళగిరి రిటర్నింగ్ అధికారి జి.రాజకుమారి మాట్లాడుతూ ఈవీఎంల ఓట్లు లెక్కింపునకు సంబంధించి టేబుల్ వద్దకు తెచ్చిన కంట్రోల్ యూనిట్ వివరాలు సరిచూసికొని వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభించాలన్నారు. రౌండ్‌ల వారీగా కంట్రోల్ యూనిట్‌లో అభ్యర్థులు సీరియల్ ప్రకారం ఫలితాలను నిర్దేశించిన ఫార్మెట్‌లో కౌంటింగ్ సూపర్ వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఈవీఎంలకు సంబంధించి కంట్రోల్ ప్యానెల్‌లోని ఫలితాలు వెల్లడించేందుకు నిర్వహించే ప్రక్రియ, కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు నిర్వర్తించాల్సిన విధులపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి స్థాయిలో శిక్షణ అందించారు. సమావేశంలో నగర కమిషనర్, గుంటూరు ఈస్ట్ ఆర్‌ఓ కీర్తి చేకూరి, డిఆర్‌ఓ పెద్ది రోజా, వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు లక్ష్మీకుమారి, శ్రీకర్, శిక్షణ నోడల్ అధికారి హరిహరనాథ్, డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

ఓట్ల లెక్కింపునకు ప్రణాళికా బద్ధంగా చర్యలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

4వ తేదీన చేపట్టనున్న ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్‌కు చెప్పారు. ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుండి సోమవారం కేంద్ర ఎన్నికల అధికారులు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్బీర్ సింగ్ సందుతో కలిసి కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ వివిధ రాష్ట్రాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ఓట్ల కౌంటింగ్ ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ మాట్లాడుతూ జూన్, 4వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్ఠమైన ప్రణాళికతో నిర్వహించాలని కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ రాష్ట్రాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఎటువంటి శాంతి భద్రతల సమస్య లేకుండా కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేసేందుకు రిటర్నింగ్ అధికారులు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకుని అమలు చేయాలన్నారు. కౌంటింగ్ కొరకు నియమించిన సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ అందించా లన్నారు. ఈవీఎం లను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతను రిటర్నింగ్ అధికారులు ప్రతీ రోజు సందర్శించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఓట్లు లెక్కింపునకు చర్యలు చేపట్టామన్నారు. అనంతరం కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్

దాడులకు పాల్పడితే గ్రామ బహిష్కరణ : డిఎస్‌పి

ప్రజాశక్తి - తుళ్లూరు

4న ఎన్నికల ఫలితాలను పురస్కరించుకుని దాడులకు పాల్పడటం, ప్రేరేపించడం లాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టపరంగా గ్రామ బహిష్కరణ చేయడం జరుగుతుందని తుళ్లూరు డిఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. గత నెల 13 న ఎన్నికల సందర్భంగా జిల్లాలో తాడికొండ నియోజక వర్గంలో చిన్న చిన్న సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. సోమవారం మందడంలోని పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయంలో డిఎస్పీ విలేకరులతో మాట్లాడారు.జూన్ 4 న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న దృష్ట్యా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉందన్నారు. ఎన్నికలలో ఏదో ఒక పార్టీ, ఒక వ్యక్తి గెలుస్తారని, పాత కక్షలను మనసులో పెట్టుకొని దాడులు, ప్రతి దాడులకు తెగబడేవారిపై క్రిమినల్ కేసులు పెట్టడంతో పాటు నగర లేదా వారు ఏ ప్రాంతంలో నివశిస్తున్నారో అక్కడ నుంచి బహిష్కరించడం చేస్తామని చెప్పారు. అయినప్పటికీ మళ్ళీ గ్రామాల్లోకి వచ్చి దాడులకు ప్రేరేపిస్తే పీడీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. శాంతియుత వాతావరణం నెలకొల్పా లని పోలీసులు చేస్తున్న కషికి సహకరించాలని కోరుతూ గ్రామాల్లో ప్రచారం నిర్వహించడం, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో శాంతి కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. తుళ్లూరు మండలంలోని పెదపరిమి, వడ్డమాను, తాడికొండ మండలం లోని నిడుముక్కల గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలకు సంబంధించి కొంతమంది పై కేసులు పెట్టడం జరిగిందన్నారు. అనవసరంగా గొడవలు పడి కేసుల్లో ఇరుక్కోవద్దని హితవు పలికారు.ఎన్నికల ఫలితాల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూసేందుకు కేంద్రప్రభుత్వంకు చెందిన 25 కంపెనీల పారా మిలటరీ దళాలు రాష్ట్రానికి వస్తున్నాయని,ఎన్నికల కమిషన్, పోలీస్ శాఖ ఎన్నికల ఫలితాలు,తదనంతరం పరిణామాలను నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని చెప్పారు.

మాట్లాడుతున్న డి ఎస్పీ అశోక్ కుమార్ గౌడ్

పాలీసెట్ ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

పాలిటెక్నిక్ కాలేజిల్లో ప్రవేశానికి సంబంధించి పాలిసెట్- 2024లో అర్హత సాధించిన విద్యార్థులకు సోమవారం నుండి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం అయ్యింది. గుంటూరు నల్లపాడులోని ఎంబిటిఎస్ పాలిటెక్నిక్ కాలేజిలో, నర్సరావుపేటలోని జెఎన్‌టియులో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. మొదటి రోజు 1-12వేల ర్యాంకుల వరకూ కౌన్సెలింగ్ నిర్వహించగా ఎంబిటిఎస్ హెల్ప్‌లైన్ సెంటర్‌లో 65 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారైనట్లు ప్రిన్సిపాల్ టి.శేఖర్ తెలిపారు. నేడు 12001 నుండి 27000 ర్యాంకు వరకూ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

వర్సిటీలో ఫలితాలు విడుదల చేస్తున్న విసి తదితరులు

ఎఎన్‌యు దూరవిద్యా కేంద్రం పీజీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్య కేంద్రం ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలలో నిర్వహించిన ఇయర్ ఎండ్ పి జి కోర్సులు, పిజి డిప్లొమా కోర్సుల సప్లమెంటరీ ఫలితాలను సోమవారం విసి పి. రాజశేఖర్ విడుదల చేశారు. ఎంఎస్సీ విభాగంలో బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, సైకాలజీ, ఏంప విభాగంలో తెలుగు, ఇంగ్లీష్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఎకనామిక్స్, సోషల్ వర్క్, జర్నలిజం, ఎంబీఏ, హాస్పిటల్ మేనేజ్మెంట్, బిఎల్‌ఐఎస్ సి, ఎమ్ఎల్‌ఐఎస్ సి, ఎంసీఏ, ఎం హెచ్ ఆర్ ఎం కోర్సుల ఫలితాలు ఉన్నాయి. ఫలితాలను అభ్యర్థులు దూరవిద్య కేంద్రం www anucde.info వెబ్ సైటు నుంచి పొందవచ్చునని ఆయన సూచించారు. ఈ సందర్భంగా దూరవిద్యా కేంద్రం పరీక్షలకు ఆర్డినేటర్ డాక్టర్ కే. సోమశేఖర్ మాట్లాడుతూ పరీక్షల ఫలితాలకు సంబంధించి అభ్యర్థులు రీవాల్యుయేషన్ కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్ కు రూ. 960లు జూన్ 7వ తేదీలోగా చెల్లించి దరఖాస్తులను జూన్ 12వ తేదీకి దూరవిద్య కేంద్రంలోని కోఆర్డినేటర్ కార్యాలయానికి దరఖాస్తులు అందేలా పంపాలన్నారు. బి ఎల్ ఐ ఎస్ సి కోర్సుకు మాత్రం రూ.770 ఫీజుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి. వర వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. కరుణ, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, దూరవిద్య కేంద్రం పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ జైనులబ్దిన్, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపల్స్ ఆచార్య పి. సిద్ధయ్య, ప్రొఫెసర్ ప్రమీలరాణి తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేస్తున్న సెక్రెటరీ, ప్రిన్సిపాల్

కెఎల్‌పి స్కూల్లో ముగిసిన వేసవి శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో ఏప్రిల్ 27వ తేదీ నుండి నిర్వహించిన వేసవ శిక్షణా శిబిరం సోమవారం ముగిసింది.ఈ సందర్భంగా విద్యార్థులు శిబిరంలో శిక్షణ పొందిన క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను ప్రదర్శించారు. సంగీత వాయిద్యాలు, స్కేటింగ్, కర్రసాము, వెస్టన్ డ్యాన్స్ వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమంలో పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఈ వేసవిలో నిర్వహించిన శిక్షణా శిబి రానికి వివిధ అంశాల్లో 175 మంది హాజరయ్యారన్నారు. ఈ శిబిరం వల్ల పిల్లల్లో మంచి ఆలోచనా శక్తి, శారీరక ధారుడ్యం ఏర్పడుతుందన్నారు. ఈ సంవత్సరం కొత్తగా రోబోటిక్స్‌పై అవగాహన తరగతులు అందుబాటులోకి తెచ్చామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ వై.రధినిచౌదరి మాట్లాడుతూ పిల్లల బాల్యం ఆనందంగా, ఆహ్లాదంగా ఎదగాలన్నారు. సమాజంలో ఆరోగ్యకరమైన అభివృద్ధి పథంలో నడిచే విద్యార్థులను తయారు చేయటానికి ఇటువంటి శిబిరాలు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను కృష్ణప్రసాద్, రధినీచౌదరి అభినందించారు. కార్యక్రమంలో ఏఒ వెంకట్రావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నీతి కథలు చెబుతున్న విద్యార్థులు

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు నీతి కథలు చెప్పించారు. ఈ సందర్భంగా గ్రంధాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కథలు చెప్పటం ద్వారా పిల్లలో ఆలోచించే తత్వాన్ని అభివృద్ధి చేయొచ్చున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.